


16న గొర్రెల పెంపకందారుల సదస్సు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 16న గొర్రెల పెంపకందారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రండి అచ్యుత రావు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక సంఘం నాయకులు బోను సింహాచలం, బొట్ట రామకృష్ణ, మురళీ, శంకరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎన్జీవో హెూం ఆవరణలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. మూగజీవాల మేతకు కొండలు,గుట్టలకు వెళ్ళే దారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని చెప్పారు.అనేక సమస్యలపై చర్చించేందుకు నిర్వహించనున్న ఈ సదస్సు కి జిల్లా లో వున్న గొర్రెలు మేకల పెంపకం దారులంతా హాజరు కావాలని అచ్యుతరావు కోరారు.

- జెడ్పి సమావేశంలో మంత్రులు కొండపల్లి, గుమ్మిడి
- టోల్‌గేట్‌ను తరలించాలి : జెడ్పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చ
- స్థాయీ సంఘాల్లో సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యేలు

జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి సమన్వయంతో, కలిసికట్టుగా కృషి చేద్దామని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్‌పి సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో వ్యవసాయం, నీటి పారుదల, వైద్యారోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జొన్నాడవద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను అక్కడినుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేశారు.

మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణితోపాటు, పలువురు ఎంఎల్ఎలు, ఎంపిలు తొలిసారిగా హాజరైన ఈ సమావేశంలో ముందుగా జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గతంలోవలే వివిధ నియోజకవర్గాల ఎంఎల్ఎలను ఆయా స్థాయి సంఘాల సభ్యులుగా నియమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని, విమానాశ్రయాన్ని త్వరగా పూర్తి చేయాలని, గిరిజన యూనివర్సిటీ పనులను మొదలు పెట్టాలని కోరారు. మంత్రి కొండపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జి.సంధ్యారాణి

మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామని అన్నారు.

రైతుల అభీష్టం మేరకు విత్తనాలు సరఫరా చేయాలి

వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, రైతు అభీష్టం మేరకు, వారికి కావాల్సిన విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. వరివిత్తనాలు 1121 వల్ల గతంలో రైతులు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. పంట నష్టపరిహారం రైతులకు సక్రమంగా అందలేదని, దీనికి సంబంధించిన వివరాలను ఇవ్వాలని వ్యవసాయశాఖ జెడిలను ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు రాకుండా చూడాలన్నారు. గిరి శిఖర గ్రామాలకు సైతం విత్తనాలు అందేలా చూడాలన్నారు. చిరుధాన్య విత్తనాలను గిరిజనులకు 90శాతం సబ్సిడీపై అందించాలన్నారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఏయే విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్న పూర్తి సమాచారాన్ని రైతులకు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఎరువులు, విత్తన షాపులపై దాడులు చేయిస్తున్నామని చెప్పారు. కురుపాం ఎంఎల్ఎ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో కూడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి మాట్లాడుతూ, నకిలీ విత్తనాలను అరికట్టాలని సూచించారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పంట కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితిని నార్త్‌కోస్టల్ సిఇ సుగుణాకరరావు వివరించారు. మొత్తం 11 ప్రాజెక్టుల్లో 129 పనులకు రూ.8.29కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 237 మంది లష్కర్ల నియామకానికి కూడా ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎంఎన్‌ఛానల్ ద్వారా సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, తోటపల్లి కాలువల ద్వారా శివారు భూములకు కూడా సాగునీరు అందించాలని కోరారు. విజయనగరం ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ప్రతిపాదించిన కొత్త పనుల వివరాలను అందించాలని కోరారు.

ఎంఎల్ఎ నాగమాధవి మాట్లాడుతూ, ఇసుక అక్రమంగా తరలించి చంపావతి నదిని చంపేశారని అన్నారు. లేఅవుట్ల కారణంగా చెరువులకు వెళ్లే కాలువలు మూసుకుపోయాయని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, లేఅవుట్లపై రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి, అక్రమణలను తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ, వరహాలగెడ్డ ఆక్రమణలపై అధికారులను నిలదీశారు. జంఝావతి హైలెవెల్ కెనాల్ ఎందుకు ఆగిందని ప్రశ్నించారు. దీనిపై ఛైర్మన్ మాట్లాడుతూ, ఇది అంతర్రాష్ట్ర సమస్య అనీ, రాష్ట్రస్థాయిలో ఇది పరిష్కారం కావాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తోటపల్లి, గడిగెడ్డ, చంపావతి నదుల అనుసంధానం జరగలేదని ఎంఎల్ఎ అదితి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సాలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు సభ్యులు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను తొలగించారంటూ మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

వైద్యారోగ్యశాఖ వాడీవేడిగా చర్చ

వైద్యారోగ్యశాఖపై వాడీవేడిగా చర్చ జరిగింది. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అన్నిరకాల చర్యలూ తీసుకోవాలని మంత్రులిద్దరూ డిఎంహెచ్‌ఒలను ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా, బోధకాలు వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రి సమస్యలను ఎంఎల్ఎ అదితి వివరించారు. ఇక్కడ సిబ్బందిని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీనిపై మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ, ఎట్టి పరిస్థితిలోనూ వైద్యులను, సిబ్బందిని తగ్గించరాదని ఆదేశించారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, ఘోషాలో కూడా సిబ్బందిని తగ్గించే పరిస్థితి ఉందని, దానిని ఆపాలని కోరారు. దీనిపై కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా సర్వజన ఆసుపత్రి వైద్యకళాశాలగా మార్పు చెందడంతో, ఎన్‌హెచ్‌ఆర్ఎం పథకంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వేరే ఆసుపత్రులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ఇక్కడ డాక్టర్లు, సిబ్బందీ తగ్గకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అరకు ఎంపి డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ, వర్షాకాలంలో గిరిశిఖర గ్రామాల్లో జ్వరాలు విజృంభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల మరణాలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, పూసపాటిరేగ మండలం కనిమెట్ట గ్రామంలో విజృంభించిన వ్యాధులను ప్రస్తావించారు. మోపాడ ఆసుపత్రిలో ఆక్రమణలను తొలగించాలని ఎంఎల్ఎ లోకం నాగమాధవి కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సామాజిక పింఛన్ల పంపిణీపై చర్చ జరిగింది. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, కొంతమంది ముత్తైదువలకు కూడా వితంతు పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. పింఛన్ల పరిశీలనకు త్వరలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందించేలా చూడాలని, అనర్హులను తొలగించాలని సూచించారు. కొంతమంది జెడ్‌పిటిసిల ఫిర్యాదుపై స్పందిస్తూ, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని ఎట్టిపరిస్థితిలోనూ సహించేది లేదని మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్ స్పష్టం చేశారు. విఎఒల తొలగింపుపై విచారణ చేయాలని ఆదేశించారు. జొన్నాడవద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను అక్కడినుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేయడంతో సభ ముగిసింది. పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించారు. అంతకు ముందు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను, మంత్రులను జెడ్‌పి ఛైర్మన్ సన్మానించారు. సమావేశంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



కలెక్టరేట్ ఎఒకు వినతిని అందజేస్తున్న వైద్యాధికారులు

వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో ఫోరెన్సిక్ డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంకెవి సంజీవనాయుడు సహ వైద్యులు, సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అతని ప్రవర్తనపై విచారణ జరిపి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, ఆర్ఎంఒ శ్యామల డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వైద్యునిపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఫోరెన్సిక్ డాక్టర్‌గా పనిచేయుచున్న సంజీవనాయుడు ప్రవర్తన వల్ల ఆసుపత్రిలో పనిచేస్తున్న వారంతా తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నారని, వీరివల్ల అందరూ మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. ఆయన ఆసుపత్రి అఫీసియల్ వాటాస్‌అప్ గ్రూప్లో ఇష్టం వచ్చినట్లుగా దురుద్దేశ్యంతో ముఖ్యంగా మహిళలను, ఇతర సిబ్బందిని ఉద్దేశిస్తూ తీవ్ర పదజాలాలతో నోటికి ఇష్టం వచ్చినట్లు మెసేజ్ లు పెడుతున్నారని అన్నారు. ఎన్నిసార్లు ఎంతో మంది సిబ్బంది, డాక్టర్లు, మెడికల్ సూపరింటిండెంట్ తదితరులు వారించినా అతని ప్రవర్తనలో ఏ రకమైన మార్పు లేదని వాపోయారు. డాక్టర్ ప్రవర్తన వల్ల ఏ ఒక్కరూ వృత్తిలో నిమగ్నం అవ్వలేక పోతున్నామని, ఎంతగానో మానసిక క్షోభ అనుభవిస్తూ తమ విధులు నిర్వహించడానికి చాలా ఇబ్బందిగా ఉందని, ప్రశాంత వాతావరణం కోల్పోతున్నామని వాపోయారు. గతంలో కూడా ఇతనిపై దర్యాప్తు కొరకు కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీను వేశారని, ఆ నివేదిక ఏమైందో ఇప్పటివరకు తమకు తెలియడంలేదని అన్నారు. కనుక జిల్లా కలెక్టర్ వారు అతనిపై విచారణ జరిపి, సదరు వైద్యుడ్ని ఆసుపత్రి నుంచి పంపించి అందరికీ ఆయన వేధింపుల నుంచి విముక్తి కల్పించాల్సిందిగా కలెక్టరేట్ ఎఒకు వినతి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది తప్పకుండా ఆగస్టు 31లోపు స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని జి పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో ఎంపికైన విద్యార్థులు తప్పకుండా ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఫ్రెష్ / రెన్యువల్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 30వ తేదీ ఆఖరు అని తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా మెరిట్ లిస్ట్ లో ఉన్న విధంగానే ఆధార్‌లో ఉండేవిధంగా సరిచూసుకుని పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా తన ఆధార్ నెంబర్‌ను తన బ్యాంక్ ఖాతాకు సీడ్ చేయించుకొని డిబిటి ద్వారా డబ్బులు జమయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

టిడిపి చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?

'తల్లికి వందనం'పై మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల జరిగిన ఎన్నికల ముందు టిడిపి జాతీయ అధ్యక్షులు, ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి, ఇప్పుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రజలకు చెప్పిందేమిటి, ఇప్పుడు చేస్తున్నదేమిటని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం పథకం అమలుపై టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి ఏమి చెప్పారో గుర్తు తెచ్చుకోవాలని కోరారు. ఎన్నికలకు ఆరునెలల ముందు నుంచే సూపర్ సిక్స్ హామీల గురించి గొప్పగా చెప్పారని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ అమ్మకు వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున నగదు పంపిణీ చేస్తామని ఊదర కొట్టారని చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుపై జీవో 29 జారీ చేసిందని తెలిపారు. ఎంతమంది చదువుకున్న పిల్లలున్నా తల్లి పేరున రూ.15వేలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు జీవోలో వుందన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదువుతున్న కుటుంబంలో అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున మంజూరు చేస్తామని చెప్పి ఇప్పుడు అమ్మ ఒక్కదానికే రూ.15 వేల చొప్పున పంపిణీ చేస్తామనడం మోసం కాదా అని ప్రశ్నించారు. తాను చేగువేరా వారసుడిననిచెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా సూపర్ సిక్స్ హామీలపై గొప్పగా చెప్పారని అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో లో ప్రకటించిన హామీల అమలు బాధ్యత పవన్ కళ్యాణ్‌కు ఉందన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకం అమలుపై నాడు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏం చెప్పారో, ఇప్పుడు ఏం చేస్తున్నారో అర్థం చేసుకున్న తల్లులు వారిని నిలదీయాలని కోరారు.

బిసి బాలుర హాస్టల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని వెనుక బడిన తరగతి బాలుర వసతి గృహాన్ని అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సమయపాలన అవసరమని నిర్దేశించారు. మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తప్పక వేడి నీరు తాగాలని, ఆరోగ్యం సమస్యలు ఉంటే వెంటనే వార్డెన్‌కు తెలియజేయాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు, వార్డెన్ శ్రీను పాల్గొన్నారు.

హిందీలో బోధన... విద్యార్థుల రోదన

ఇలాగైతే ఇంటికి వెళ్లిపోతామంటున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమకు పూర్తిగా హిందీలో పాఠ్యాంశాలను బోధిస్తే ఏమీ అర్థం కావడం లేదని, ఇలాగైతే తామంతా పాఠశాలలను విడిచిపెట్టి ఇళ్లకు వెళ్లిపోతామంటున్నారు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు. వివరాలు ప్రకారం.. గుమ్మలక్ష్మీపురంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ ఏడాది అక్కడ చదువుతున్న విద్యార్థులకు పెద్ద సమస్య ఏర్పడింది. ఈ పాఠశాలకు మూడు నెలల క్రితం కొంతమంది ఉపాధ్యాయులు రెగ్యులర్ ప్రాతిపదికన వచ్చారు. అయితే ఈ పాఠశాలకు ఉపాధ్యాయులంతా బీహార్, ఉత్తర ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల నుండి వచ్చిన వారే. వీరంతా కేవలం హిందీలోనే పాఠ్యాంశాలను బోధిస్తుండడంతో గిరిజన విద్యార్థులకు ఏమీ అర్థంకాక విద్యార్థులు తరగతి గదుల్లో నిశ్శబ్దంగా ఉండి పోవడం తప్ప మళ్లీ అడిగితే ఉపాధ్యాయులు కోపగించుకుంటున్నారని అంటున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు తప్ప మిగతా ఉపాధ్యాయులు హిందీలోనే పాఠ్యాంశాలను బోధిస్తుండడంతో ఇంతవరకు తెలుగు మాధ్యమంలో చదివిన గిరిజన విద్యార్థులకు ఏమీ అర్థం కాక తెల్ల మొహం వేసుకుని కూర్చుంటున్నారు. దీంతో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రిన్సిపల్ పెంటన్న దగ్గరకు వెళ్లి తమ మొరను విన్నవించుకున్నారు. అయితే తాను కూడా ఏమీ చేయలేక గుంటూరులో ఉన్న గురుకుల ప్రధాన కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు గతంలో గెస్ట్ ఉపాధ్యాయులుగా పనిచేసిన సిబ్బందిని పాఠశాలకు రప్పించుకొని విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేలా చేయాలని సమాచారం అందించారు. దీంతో మరికొన్ని రోజుల్లో పాత గెస్ట్ ఉపాధ్యాయులు పాఠశాలకు వస్తారని విద్యార్థులకు ప్రిన్సిపల్ పెంటన్న శాంతింప చేశారు. ఏకలవ్య పాఠశాలలో మొత్తం 24 ఉపాధ్యాయ పోస్టులు గాను 18 మంది ఉపాధ్యాయులను శాశ్వత ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం మూడు నెలల క్రితం నియమించింది. అయితే నేటి వరకు కేవలం 9 మంది ఉపాధ్యాయులతో పాటు ముగ్గురు నాన్ టీచింగ్ సిబ్బంది పాఠశాలకు హాజరయ్యారు. అయితే మిగతా ఉపాధ్యాయులు మరో వారం రోజుల్లోపు వచ్చేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ పెంటన్న తెలిపారు.



తమ సమస్యలను ప్రిన్సిపల్‌కు వివరిస్తున్న విద్యార్థులు

గిరిజన విద్య గాడి తప్పుతోందని గిరిజన సంఘాల ఆందోళన

అసలే గిరిజన విద్యార్థులు భయం భయంతో చదువుకోడానికి వస్తున్న వారికి తెలుగు, ఇంగ్లీష్ కూడా సరిగ్గా అర్థం కాని పరిస్థితి. ఇటువంటి తరుణంలో హిందీలో బోధిస్తే ఇంకేమి అర్థమవుతుంది. ఇదే ప్రస్తుతం మన్యం జిల్లాలో ఉన్న ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆవేదన. మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికిపెంట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఇటీవల ఉత్తర భారతానికి చెందిన కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. హిందీ మాధ్యంలో విద్యా బోధన చేయడంతో గిరిజన విద్యార్థులకు అర్థం కాక చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇంగ్లీష్, తెలుగు భాషల్లో బోధించేవారు. విద్యార్థులు సులభతరంగా అర్థం చేసుకొని చదువు పట్ల ఎంతో ఆసక్తి కనబరిచేవారు. అయితే కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను తొలగించి వారి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నార్త్ ఇండియాకు చెందిన వారిని ఇక్కడ ఉపాధ్యాయులుగా నియమించడంతో అసలు సమస్య ఇక్కడే మొదలైంది. వచ్చినవారు హిందీలో బోధించడంతో గిరిజన విద్యార్థులకు అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. సైన్స్, సోషల్, ఇంగ్లీష్, లెక్కలు సైతం హిందీలోనే బోధన జరగడంతో ప్రస్తుతం టెన్త్ విద్యార్థులు మరింత ఆందోళన చెందుతున్నారు. బోధన చేస్తున్న వారికి హిందీ తప్ప మరేయితర భాషలు రావడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏకలవ్య పాఠశాలలో పరిస్థితులు చక్కబడే వరకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఈపాఠశాలలపై సమీక్ష జరపాలని గిరిజనవిద్యను కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ నాయకులు తాడంగి సాయిబాబు, ఉర్లక నాగార్జున డిమాండ్ చేశారు.



అడలి వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వచ్చే సీజన్‌కు 'అడలి' సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అడలి - పర్యాటక వ్యూ పాయింట్ పర్యాటకులను ఆకట్టుకునేందుకు సిద్ధం అవుతోంది. ప్రకృతి అందాల అద్భుతమైన దృశ్య ప్రదేశంగా అడాలి వ్యూ పాయింట్ ఉంది. సీతంపేట ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సి.విష్ణు చరణ్ శుక్రవారం జరుగుతున్న పనులను పరిశీలించారు. రెస్టారెంట్, క్యాంప్ హౌస్‌తో కూడిన టెంట్లు, వ్యూ పాయింట్ అక్కడ నిర్మిస్తున్నారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పనులు చేస్తోంది. సుందరీకరణ పనుల నిర్మాణాలను ప్రాజెక్టు అధికారి పరిశీలించి వచ్చే సీజన్ నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించడానికి ఇది మంచి ప్రదేశం, పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పులిపుట్టిలో గోకులం షెడ్ల నిర్మాణాలను, సీతంపేట మండలంలో హెచ్ఎన్‌టీసీ (హార్టికల్చర్ అండ్ నర్సరీ ట్రెనింగ్ సెంటర్) పనులను పరిశీలించిన అనంతరం గిరిజన మ్యూజియాన్ని పరిశీలించారు. గిరిజన మ్యూజియం పనుల స్థితిగతులను అధికారులు తెలిపారు. అసిస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.చినబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, తదితరు హాజరయ్యారు.

నేడు సాగునీరు విడుదల

ప్రజాశక్తి - వీరఘట్టం

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా ఈనెల శనివారం సాగునీరు విడుదల చేయనున్నట్లు స్థానిక నీటిపారుదల శాఖ ఎఇఇ కె.రాజేష్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కురుపాం, రాజాం, పాలకొండ, నియోజకవర్గాల ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కొండ్రు మురళీమోహన్, నిమ్మక జయకష్ణులు చేతుల మీదుగా సాగునీరు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు, వీధి కాలువల్లో నీరు ప్రవహించింది. మరోవైపు పంట పొలాలు నీటితో నిండాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షంతో ప్రయాణికులు, విద్యార్థులు, కూరగాయల వ్యాపారాలు ఇబ్బందులు పడ్డారు.

జోరందుకున్న పొలం పనులు

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో వర్షాలు కురవడంతో పొలం పనులు జోరందుకున్నాయి. రైతులు దుక్కులు ప్రారంభించి విత్తనాలు చల్లుతున్నారు. మరి కొన్నిచోట్ల జూన్‌లో విత్తనాలు చల్లడంతో వరినారు అందుకొచ్చింది. ఈ నెలలో విస్తారంగా వర్షాలు కురిస్తే దమ్ములు ప్రారంభానికి అవకాశం ఉంటుందని గిరిజన రైతులు చెబుతున్నారు. కేదారిపురం, వంగర, దుమ్మంగి, పెద్ద ఖర్జ, చెముడు గూడ, గొరడ, రాయగడ జమ్మూ, సిహెచ్ బిన్నిడి తదితర గ్రామాల్లో రైతులు పొలం పనులు ప్రారంభించారు. గత ఏడాది సరైన వర్షాల్లేక కరువు ఏర్పడింది. ఈ ఏడాది అడపా దడపా వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 8800 ఎకరాల్లో 5400 మంది రైతులు ప్రతి ఏటా ఖరీఫ్ సాగు చేస్తున్నారు. వరి పంటలతో పాటు అరటి, పత్తి వంటి వాణిజ్య పంటలను కూడా రైతులు పండిస్తున్నారు. కొండపోడులో చిరుధాన్యాలు పండిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల వద్దకు వస్తున్నారు.

భాస్కర్ డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి మంజూరైనట్లు ఆ కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎన్‌సిసి పిఒ అజయ్ కుమార్, జయప్రకాశ్ భాస్కర్ డిగ్రీ కళాశాలను పరిశీలించడానికి వచ్చారని, తమ పరిశీలన అనంతరం ఎన్‌సిసి మంజూరు కూడా వారు చేసినట్లు తెలిపారు. మన్యం జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొట్టమొదటిగా ఎన్‌సిసికి ఎంపిక చేసినందుకు ఎన్‌సిసి అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవి శాస్త్రి,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన మద్యంబాటిళ్లను ధ్వంసం చేస్తున్న డిఎస్‌పి జివి కృష్ణారావు

అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం : డిఎస్‌పి

ప్రజాశక్తి-వీరఘట్టం

అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కు పాదం మోపాలని పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పోలీస్ దాడుల్లో పట్టుబడిన సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ దాడుల్లో ఇరవై ఏడు కేసుల్లో పట్టుబడిన 354 లీటర్ల నాటు సారాను, ఆరు కేసుల్లో పట్టుబడిన 23.4 లీటర్ల మద్యం బాటిళ్లను వీరఘట్టం మండలం యు.వెంకంపేట గ్రామ సమీపంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్‌కె ఫక్రుద్దీన్, సిబ్బంది ,ఉన్నారు.


వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పారా లీగల్ వాలంటీర్ కోటేశ్వరరావు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనాలు నడిపేవారు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పారా లీగల్ వాలంటీర్ అందవరపు కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కురుపాంలో గల రావాడ కాంప్లెక్స్ వద్ద మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, లేనిచో ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు తీవ్ర గాయాలై మరణించే సంఘటన ఉండొచ్చన్నారు. అంతే కాకుండా హెల్మెట్ ధరించకపోవడం నేరమని దీనికి తగిన శిక్ష పడుతుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎఎస్ఐ ఎ.రమణ, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.


ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జలోని విజయ రాఘవ పెట్రోలు ఎరువుల దుకాణ సంఘం, నాయుడు పెట్రోల్ ఫెర్టిలైజర్ ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయించరాదని, ఎరువుల నిల్వలను స్టాక్ బోర్డులో పెట్టాలని సూచించారు. ఎరువులు కొన్న వారికి బిల్లులు ఇవ్వాలని సూచించారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'భూదేవి గ్రూపును పార్టీ నుంచి తొలగించండి'

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవితో పాటు కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేసిన సామంతుల దామోదర్‌రావు, కండాపు వెంకటరమణ, గుమ్మిడి సింహాద్రి, పైల సత్తిబాబు, మజ్జి జయశంకర్, తదితరులను పార్టీ నుండి తొలగించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు శుక్రవారం రాష్ట్ర టిడిపి కార్యదర్శి కర్నేన అప్పలనాయుడుతో పాటు మరి కొంతమంది వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి, వైసిపికి సానుకూలంగా పనిచేశారన్నారు. బహిరంగంగానే వారంతా వైసిపికి పని చేయడం వల్ల పార్టీ కొంతవరకు నష్టం చేకూరుతుందన్నారు. వారిని పార్టీ నుంచి తొలగిస్తేనే, పార్టీలో మరింత ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఇన్-ఛార్జ్ గా భూదేవిని తొలగించాలని అన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లిలోని వెంకటేశ్వర స్వామి. కోదండ రామస్వామి దేవస్థానం ఆలయ హుండీలు శుక్రవారం కార్యనిర్వహణాధికారి వివి సూర్యనారాయణ సమక్షంలో లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి ఈనెల 12వరకు వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ.4,15,205, కోదండ రామ స్వామి ఆలయ హుండీల ద్వారా రూ.8,645 వచ్చింది. హుండీల లెక్కింపు పర్యవేక్షకులు పార్వతీపురం గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాద్ వచ్చారు. కార్యక్రమంలో తోటపల్లి దేవస్థానం కమిటీ సభ్యులు ద్వారపురెడ్డి ధనుంజయ రావు, శ్రీరామ చంద్ర మూర్తి , మార్కొండ ఫకీరు నాయుడు , మార్కొండ వాసు నాయుడు , మోనంగి ప్రకాష్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సంతనర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంతనర్సిపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ చంటి పిల్లలు, మధుమేహ, రక్త పోటు, జ్వర పీడితులకు తదితర రకాలైన వ్యాధులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా , 104 సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండల సమాఖ్య నూతన పాలక వర్గాన్ని శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించినట్లు ఏపిఎం నాగభూషణరావు తెలిపారు. అధ్యక్షులుగా పల్లి రాజేశ్వరి, కార్యదర్శిగా గుణుపూరు పార్వతి, కోశాధికారిగా పాడేరు మంగమ్మ, సంయుక్త కార్యదర్శిగా జోగి మంగమ్మ, ఉపాధ్యక్షులుగా ఊయక పావని ఎన్నికయ్యారు.


కొత్తగా ఎన్నికైన మండల సమాఖ్య కార్యవర్గం

గొయ్యిలో కూరుకుపోయిన లారీని

బయటకు తీసేందుకు తంటాలు

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల్లో వాహనాలు కూరుకుపోవడంతో వాటిని బయటకు తీసేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి రోడ్డు గోతుల్లో శుక్రవారం కూరుకుపోయిన లారీని బయటకు తీసేందుకు లారీ యజమానులతో పాటు స్థానికులు తీవ్ర తంటాలు పడ్డారు. దీంతో ఈ గుండా వస్తున్న అనేక వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఐదు చోట్ల రహదారి పూర్తిగా పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు బారినపడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు వారి వద్ద నిధులు లేకపోవడంతో వారు రోడ్డు వైపే చూసే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అప్పుడప్పుడు గోతులు కప్పుతున్నా అవి తాత్కాలికంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత పెద్దవిగా మారి వాహనాలు అందులో కురుకుపోతున్నాయి. కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. మరోవైపు ట్రాఫిక్ అంతరాయంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవడంతో వాహనదారులు గోగోలు పెడుతున్నారు.

మళ్లీ ఇరుక్కున్న ఇసుక లారీ

భామిని : మండలంలోని గురండి గ్రామం ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతిలో ఇరుక్కున్న ఇసుక లారీని శుక్రవారం జెసిబి సహాయంతో బయటకు లాగారు. వాహనాల రాక పోకలు సజావుగా సాగుతున్నాయనే సమయంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం పడడంతో బత్తిలి నుండి వస్తున్న ఇసుక లారీ ఒక వైపు టైర్లు మళ్లీ అదే గోతిలో శుక్రవారం మధ్యాహ్నం ఇరుక్కున్నాయి. రోడ్డు ఇరుగ్గా ఉండడంతో వాహనాల రాకపోకలకు వాహనదారులు అవస్థలుపడుతున్నారు. ప్రస్తుతం జెసిబితో లారీని బయటకు లాగడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. గత రెండు రోజులుగా గురండిలో వాహనదారులు అవస్థలుపడుతున్నారు. ఇకనైనా అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టడమో లేక పూర్తి స్థాయిలో రోడ్డు వేసేలా చూడాలని వాహనదారులు కోరారు.


ఆర్అండ్‌బి రహదారిపై కూరుకుపోయిన లారీకి బయటకు తీస్తున్న వాహనచోదకులు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - పాలకొండ

మెమో 1214 రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో శ్రీ కోట దుర్గ మార్బుల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ 1996లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ఫలితంగా అన్ని రాష్ట్రాల్లోనూ భవననిర్మాణ కార్మికులకు ప్రత్యేకమైన సంక్షేమ బోర్డు ఏర్పాటయ్యాయని అన్నారు. రాష్ట్రంలో ఎపి భవనం, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటైందన్నారు. వేలాదిమంది సంక్షేమ పథకాలు అందించబడ్డాయని, సంక్షేమ బోర్డు కార్యకలాపాలతో భవన నిర్మాణ కార్మికులకు పని ప్రదేశాల్లో ప్రమాదాల పాలైన, ఇతర రోడ్డు ప్రమాదాలు జరిగిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి కుటుంబానికి రూ.5లక్షలు సహాయం అందేవన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమ బోర్డు కార్యకలాపాలను స్తంభింప చేస్తూ, మెమో 1214 విడుదల చేశారు. దీని ఫలితంగా గత మూడున్నరేళ్లకు పైగా భవననిర్మాణ కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదన్నారు. కొత్త సభ్యులను బోర్డులో నమోదు చేసుకోవడం ఆపేశారని, గుర్తింపు కార్డులను సైతం ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెమో 1214 రద్దు చేసి, పూర్వం మాదిరిగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడానికి తగిన చొరవ తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం శ్రీ కోటదుర్గ మార్బుల్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. కమిటీ గౌరవాధ్యక్షుడు అర్తమూడి లక్ష్మణరావు, అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, ప్రధాన కార్యదర్శి రామదాసు అప్పలనాయుడు, కోశాధికారి జాగీరు, ఉపాధ్యక్షులు సల్మాన్, కార్యదర్శి మజ్జి శ్రీను, కమిటీ మెంబర్స్ చందక విశ్వేశ్వరరావు, మురపాక బాబురావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, మార్బుల్ వర్కర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగా ఎన్నికైన భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గ సభ్యులు

విద్యాసదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 21న ఎపిటిఎఫ్ గరుగుబిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే విద్యా సదస్సును విజయవంతం చేయాలని జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యారంగ పరిస్థితులు మన కర్తవ్యాలు అన్న అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు అనే అంశంపై రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులుగా పాండురంగ వరప్రసాదరావు, ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనలు అన్న అంశంపై రాపాక నాగేశ్వరరావు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఫెడరేషన్ అధికార పత్రిక ఉపాధ్యాయలో ఔత్సాహిక వ్యంగ్య చిత్ర కళాకారునిగా ఆరంగేట్రం చేసిన ప్రముఖ ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చిత్ర నఖ చిత్ర కళాకారుడు పల్ల పరిసినాయుడుకి, ఎపిటిఎఫ్ నఖచిత్ర కళా విశారదలి అనే బిరుదుతో సత్కరించనున్నట్లు తెలిపారు. కావున ఉపాధ్యాయిలు, కళాభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రవీంద్ర భారతి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అడ్మిషన్ పేరుతో డబ్బులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసగించిన రవీంద్ర భారతి స్కూల్ యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఎఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రవీంద్ర భారతి విద్యా సంస్థ అడ్మిషన్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.3300 చొప్పున సుమారుగా 70 మంది వరకు వసూలు చేశారన్నారన్నారు. అలాగే విద్యావ్యవస్థను దుర్వినియోగం చేస్తూ తల్లిదండ్రులు దగ్గర రెండు లక్షలు బాండ్ పేపర్లు కూడా రాయించుకోవడం, వారి నుంచి రూ.2లక్షలు తీసుకుని విద్యార్థుల తల్లిదండ్రులను మోసగించిన విద్యా సంస్థ యజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు ఎఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని, లేనిచో చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పసుపురెడ్డి శంకర్రావు, బోటు గురునాథం, కోరాడ నూకరాజు, గుడ్ల మోహన్, భవిరిశెట్టి సుధాకర్, గుడ్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక రెగ్యులర్ పాఠశాల ఆవరణలోనే భవిత కేంద్రంలో శుక్రవారం డాక్టర్ బి.శ్రీకాంత్ దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇక్కడ చేసిన ఇళ్ల వద్ద తరచుగా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నారాయణరావు, ఎంటిఎస్ ఉపాధ్యాయులు దివాకర్, ఐఇఆర్ పి.రాంబాబు, యు.ఈశ్వరి, సిజివి ఎ.సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ సహాయకులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్రమణ్యం

తీరు మార్చుకోకపోతే ఫిర్యాదు చేస్తా...

ప్రజాశక్తి - వీరఘట్టం

పనితీరు మార్చుకోకపోతే మీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం ఇంజినీరింగ్ సహాయకులకు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాల్లో సందర్శించి నీటి పరీక్షలు, ఎక్కడైనా మంచినీటి సరఫరా అయిన పైప్లైన్ దెబ్బతిన్నట్లయితే వాటి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి తక్షణమే సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో విధులకు హాజరవ్వాలన్నారు. గ్రామాల నుంచి మీ పై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మార్చుకోకుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సకాలంలో అందరూ విధులకు హాజరు కావాలని సూచించారు.


నేత్ర పరీక్షలను పరిశీలిస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

కండ్లకలక నివారణపై ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

కండ్ల కలక నివారణపై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అంధత్వ నివారణ సంస్థ సూచనల మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధి అయిన కండ్ల కలక నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 38 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఇద్దరికి కండ్లకలక వ్యాధి లక్షణాలున్నట్లు గుర్తించి వారికి చికిత్స అందించామని తెలిపారు. కండ్లకలక వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామని, మిగతా వారికి కంటిచూపు పరీక్షలు, ఇతరత్రా పరీక్షలు చేసి దృష్టి దోషం ఉన్న వారుకి ఉచిత కంటి అద్దాలు కోసం సిఫారసు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు రమేష్, మాలిక, శిరీష, ఆరోగ్య మిత్ర సురేష్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుగుపేట, చల్లమునాయుడువలస, పెద అంకలాం, తామరకండి, కాజీపేట తదితర గ్రామాల్లో శుక్రవారం మంచినీటి ట్యాంకులను శుభ్రపర్చి, క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా అన్ని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీ పరిధిలో ఉన్న మంచినీటి ట్యాంకులు పారిశుధ్య పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణార్హత కార్డుతో సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సీతంపేట

అర్హత గల కౌలు రైతులంతా రుణ అర్హత కార్డును తప్పనిసరిగా పొందాలని, ఈ కార్డులు సంక్షేమ పథకాలు కూడా వర్తిస్తాయని స్థానిక తహశీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక: సచివాలయంలో కౌలు రైతులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన కౌలు రైతుల అర్హత కార్డు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సులభతరంగా పొందవచ్చని అన్నారు. రైతు భరోసా, బ్యాంకు రుణాలు, వ్యవసాయ పరికరాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఒ వెంకటేష్, విఆర్ఒ సుబ్బారావు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మహేశ్వరరావు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో శనివారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఎఇ జి.నీలిమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు సరఫరా ఉండదని, కావున వినియోగదారులు గమనించాలని కోరారు.

మక్కువ : 33/11 కెవి విద్యుత్ మరమ్మతులు జరుగుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఇఇ వివి కిషోర్ శుక్రవారం తెలిపారు. శనివారం స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గల మక్కువ, వెంకట భైరిపురం, నగుళ్ళు, దబ్బగెడ్డ, ములక్కాయ వలస, కన్నంపేట సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, కావున వినియోగదారులు సహకరించాలని కిషోర్ కోరారు.

పార్వతీపురంటౌన్ : పట్టణం, బెలగాం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ మురళీకృష్ణ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలో గల విద్యుత్ సబ్ స్టేషన్లో నిర్వహణా పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి చేయనున్నారు. ఈమేరకు గరుగుబిల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్న నేపథ్యంలో వినియోగదారులు ఈ విషయమై గమనించాలని మండల విద్యుత్‌శాఖ ఎఇ బొంతాడ శంకరరావు తెలిపారు.

సాలూరు: పట్టణంలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం పట్టణంతో పాటు గుమడాం, కూర్మ రాజు పేట, జీగిరాం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మక్కువ, పాచిపెంట మండలాల్లో కూడా సబ్‌స్టేషన్ల మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో మండలాల్లో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇఇ కిశోర్ ఆ ప్రకటనలో కోరారు.

20న గురుకుల కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతంపేట బాలికల గురుకుల కళాశాల బాలుర గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు ఈనెల 20న బాలుర గురుకుల కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి పిఒ విష్ణు చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ మార్కుల ఆధారంగా గిరిజన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట ప్రతిభ గురుకుల పాఠశాల బూర్జ జిల్లా ఉన్నత పాఠశాల గాదిలివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2023 -24లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించారు. 8మంది విద్యార్థులకు త్రిపుల్ ఐటి సీట్లకు ఎంపికైనట్లు ఎంఇఒ జి.సూర్యదేవుడు తెలిపారు. గాదెలవలసకు చెందిన బి.దినేష్ కుమార్ (నూజివీడు), సిహెచ్ మౌనిక (ఒంగోలు), వి.లోకేశ్వరి (ఒంగోలు) బూర్జకు చెందిన డి.మహేష్ (శ్రీకాకుళం), జి.గణేష్ (శ్రీకాకుళం) జోగింపేటకు చెందిన పొగిరి సత్యం (నూజివీడు) శ్రీ సాయి తిరుమల (నూజివీడు) సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సీతానగరంలో పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 7 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న పశుగ్రాసవారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతానగరం పశు వైద్యశాల పరిధిలో పశుగ్రాస వారోత్సవాలు డాక్టర్ దీనకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు దామినేని రవీంద్రబాబు పశుగ్రాసాల పెంపకం, వాటివల్ల పశు సంపదకు చేకూరు లాభాలు, రైతుకు అధికాదాయం పొందే విధానం తోటి రైతులకు వివరించారు. అలాగే పశుగ్రాసాల అవసరత, రైతులకు కలుగు లాభాలు గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో పెదబోగిలి, చినబోగిలి, జోగింపేట రైతు సేవా కేంద్రాల ఎహెచ్‌ఎలు జానకి, జానకీరామ్, శిరీష పాల్గొన్నారు.


కాలువల్లో పూడికలు తీయిస్తున్న ఎంపిడిఒ , కార్యదర్శి

పలు గ్రామాల్లో డ్రైడే

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూరు గ్రామంలో డ్రై డే కార్యక్రమంలో భాగంగా కాలువల్లో తొలగిస్తున్న పూడికల పనులను ఎంపిడిఒ పైల సూర్య నారాయణ పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు ఆయా వీధుల్లోని పక్కా కాలువల్లో పూడికలు తొలగించారు. అనంతరం దోమల నివారణ మందును పిచికారి చేయించడంతో పాటు బ్లీచింగ్ వేయించినట్లు సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, పంచాయతీ కార్యదర్శి సంధ్య తెలిపారు. కాలువల్లో పూడికలు, తొలగింపు పనులతో పాటు గ్రామపంచాయతీల శివార్లలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందని తెలిపారు.

రక్షిత నీటి పథకాల్లో క్లోరినేషన్

ప్రస్తుత వర్షాకాలం సీజన్ లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా గ్రామ పంచాయతీల్లోని రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దూరు పంచాయతీ సర్పంచ్ మచ్చ నారాయణమ్మ, ఉపసర్పంచ్ తెర్లి యల్లంనాయుడు తెలిపారు. గామంలోని రక్షిత మంచినీటి పథకాల్లో చేపడు తున్న క్లోరినేషన్ కార్యక్రమాన్ని ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ గోపి గౌరీశంకర్రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరుబావుల సమీపంలో మురుగునీరు నిలువ ఉండకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పరిశీలనలో గ్రామ సచివాలయ కార్యదర్శి బిడ్డిక సుభద్ర , తదితరులు పాల్గొ న్నారు.

రోడ్డు ప్రమాదంలో సోషల్ ఆడిట్ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోషల్ ఆడిట్ ఉద్యోగ పనిచేస్తున్న వ్యక్తికి గాయాలైనట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. గురువారం రాత్రి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిమిత్తం వచ్చిన అనిమిరెడ్డి అప్పలనాయుడు నడుచుకుంటూ వస్తుండగా కూనేరు వద్ద మోటార్ సైకిల్ వైపు వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో అప్పలనాయుడు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.